
# ముక్కాలిపీట మీద వీనస్

నవులూరి వెంకటేశ్వరరావు




ఘోమ వార్త అందిన వెంటనే బయలుదేరి, ఒక పగలు, ఒక నిద్రలేని రాత్రి గడిపి, వందల యోజనాల దూరం ప్రయాణం చేసి ఇల్లు చేరేసరికి పూర్తిగా అలసిపోయి ఉన్నాం. ఇంట్లో అలికిడి లేదు. కాలింగ్ బెల్ పదేపదే నొక్కి తలుపు బాదినా ప్రతిస్పందన లేదు.

## ఒకటి

ఇంటి పక్కనించి పడకగది దగ్గిరగా వెళ్లాం నేనూ, నాన్నా. పై కిటికీ తెరచి ఉంది. ఆయన చెప్పినట్లు పైకెక్కి చూశా. మంచం మీద వెల్లకిలా పడుకుని వున్నాడు తాతయ్య. మూలగా ఆయన ఇపుడు తలవుంచిన వైపు వుంటూ వచ్చిన వీనస్ విగ్రహం ఏదో తగిలి కింద పడివుంది, తలవేరై. 'తాతయ్యా, తాతయ్యా' అని దిక్కులు పిక్కటిల్లేలా అరిచి పిలిచినా, ఎపుడూ కోడినిద్ర మాత్రమే పోయే ఆయన 'ఊ' అనలేదు. వరండా తలుపులు బద్దలు కొట్టి జొరబడి తాతయ్యను చూస్తున్నపుడు, బరువును దింపుకున్నప్పటి ఉపశమనం, శ్రమ తదుపరి విశ్రాంతి ఛాయలు ఆయన ముఖంలో కనిపించాయి నా కళ్లకు.

ఆ సాయంత్రం ఖననం అయిపోయింది. బయటి వరండాలో అందరూ గుమిగూడి జ్ఞాపకాల నెమరువేతల్లో వున్నారు. ఆశ్చర్యం నించి ఎవరమూ కోలుకోలేదు. తాతయ్య గదిలోకి నడిచాను పిల్లిలా, పత్తేదారులా.

ముక్కాలిపీట మీద వీనస్ మొండేన్ని ఎవరో అనవసరంగా నిలబెట్టారు. తల కిందనే పడివుంది నేలను చుంబిస్తూ. విగ్రహం పక్కనే పుస్తకాల అర. దాంట్లో ఒక దినచర్య పుస్తకం విడిగా వుంది. తిరగేస్తుంటే, జనవరి 18, అంటే నిన్నటి తారీఖును దాటి మరి నాలుగయిదు పేజీలపైన చిన్నిచిన్ని అక్షరాలతో ఏదో దీర్ఘంగా రాసి వుంది. ఏమిటది? రహస్యపు లోయలు కొలిచే వయసు నాది. డాబా మీదికి ఆ పుస్తకం తీసుకెళ్లి, ఆ నల్ల అట్ట పుస్తకం చదవటం మొదలుపెట్టాను.

## రెండు

పిల్లలు వందల యోజనాల దూరంలో బతుకుతున్న కారణంగా, మా ఇద్దరికే పరిమితమైన సామ్రాజ్యంలోకి - పడకగదిలోకి - వచ్చాను. కొద్ది గంటల క్రితం వరకు ఈ సామ్రాజ్యానికి పాలకులం, పాలితులం మేము ఉభయులం. ఇపుడు ఇది నా ఒక్కడిదే. భాగస్వామి చనిపోయి, మూడేళ్ల నాడు కలసి వేసిన మరుగుజ్జ కొబ్బరి మొక్కకు అతి దగ్గిరగా, వెల్లకిలా పడివుంది - సౌందర్యపు గతి చివరకు ఏమిటో రుజువు చేస్తున్నట్లు. స్వల్పకాలంలో కాపు వచ్చి, అంతే కాలంలో కాలం చేసే ఆ మొక్క నీడనిచ్చి ఎండతీవ్రత నుంచి కాపాడుతోంది ప్రాణరహిత శరీరాన్ని.

అద్దంలో చూసుకున్నా. నార్సిసస్‌లా నా ప్రతిబింబంతో నేను మోహంలో పడటానికి కాదు. రెండు రోజులుగా పట్టించుకోని గడ్డం దూదిపార అంటించినట్లుంది. దూది రంగు తెలుపు. తల మాత్రం నల్లగా, కాటుకలా, చీకటిలా, కాకిలా, అబద్ధంలా వుంది. వారం రోజులు పోతేగాని నిజరూప దర్శనం అవదు. ఈసారి ఒక ఆశను కలిగిస్తుంది. 'నీ రోజా దగ్గిర పడిందిలే' అన్న భరోసా మరుగున దాగిన జుత్తు రంగు సీసాను రహస్యంలా వెలుగులోకి లాగాను. మూడొంతుల రంగు అజ్ఞానంలా మిగిలి వుంది.

ఆమె కూర్చోపెట్టి రంగు వేసే ప్రతిసారీ నిజాయితీ లుప్తమయిన వ్యతిరేకపు మూలుగు మూలిగి ఊరుకునే వాడిని.

"రంగు వేసుకోవాలన్న బలమైన కోర్కె నాకుంది. నేను వేసుకుని, మీరు ముగ్గు బుట్టను తలపై మోస్తుంటే నవ్విపోతారు చూసేవాళ్లు. నా కోసం..." ఈ పంచ్‌లైనుతో 'దారికి' వచ్చినట్లు నటించా, త్యాగపు ముసుగుతో - ఎంతటి కళాకారుడు దాగి వున్నాడు నాలో! నాతో నేను సమాధానపడటానికి ఒక కారణాన్ని ఆ పలుకులు ఇచ్చాయి. నిజంగా సమాధాన పడ్డానా? సమాధాన పడ్డట్లు నా గురించి నేను నటించుకున్నానా? నటన వంచనకు పర్యాయపదం.

మొదటి రోజు సంభాషణ ఇంకా గుర్తుంది. ముక్కాలిపీట మీద కూర్చోపెట్టి, పీకకు గుడ్డకట్టి - మంగలిషాపులో పనిచేసిన అనుభవం లేకపోయినా, ప్రతిభావంతంగా నా తలకు రంగు వేస్తోంది. నేను అపుడు ఒక సుందర దృశ్యాన్ని! ఆ గ్రీన్ రూంలో నవ్వేను, వేస్తున్న సిగ్గును మౌనం మరింత చేస్తుందని.

"ఏఁవిటి కథ, నవ్వుతున్నారు? అదేదో చెప్పి నా చేతా ఆ పని చేయించొచ్చుగా?"

"కథే, ఒకటి గుర్తుకొచ్చి. జూలీ రొమైన్ అన్న మొపాసా కథ. ఆ వృద్ధురాలు ఒకనాటి మహానటి. ప్రేమతో ప్రేమలో పడుతుంది. అంటుందామె - 'చాలా మందిలో హృదయమూ శరీరంతోపాటు


ఎదుగుతుంది. నా విషయంలో అది జరగలేదు. నా శరీరం అరవై తొమ్మిదేళ్లది, హృదయం ఇరవై ఏళ్లది. ఆ కారణంచేత, ఒంటరిగా నా కుసుమాలతో, నా స్వప్నాలతో జీవిస్తున్నా' అని.

ప్రస్తుతం ప్రేమించటానికి, ప్రేమించబడటానికి మనిషీ లేడు, శారీరక పరిస్థితీ అనుకూలం కాదు గాబట్టి - వెన్నెల రాత్రులు తన యవ్వనపు దినాల వాతావరణం సృష్టించి, పడుచు జంటచేత ప్రేమ నటింప చేసి ఆనందిస్తుంటుంది".

"అయినా మనమేం ఒంటరి వాళ్లం కాదు. ఒకరి కొకరం వున్నాం, పరస్పర ప్రేమకు. ఆ కథానాయికలా కాదు".

ఆ నాటకం ఆనాడు మొదలయి కొనసాగుతుండగా మరో రోజు నవ్వాను.

"ఈసారి ఏం గుర్తుకొచ్చిందట?" పవిటకొంగును బొడ్డున దోపుకొంటూ అన్నది.




"మరో మొపాసా కథే గుర్తుకొచ్చింది".

"నా ఈ కష్టమయిన పనిలో అలసట తెలీకుండా వుండటానికి బేతాళుడిలా ఆ కథ చెప్పండి" క్యాన్వాస్ మీద కుంచెతో రంగుల చిత్రం వేస్తున్న ఏకాగ్రత మాటల్లో ధ్వనిస్తూ అన్నది చిత్రకారిణి.

"వన్ ఫేజ్ ఆఫ్ లవ్ ఆ కథ పేరు. పిచ్చెత్తించేంత సుందరమైన ఒక గతకాలపు స్త్రీ వేరు చేయబడిన జుత్తు కథానాయకుడికి దొరుకుతుంది. దానితో పిచ్చి ప్రేమలో పడతాడు. అది ముదిరి, ఆ జుత్తు తోడిదే లోకంగా, 'అన్నీ' అదే తోడుగా కానిస్తుంటాడు. ఆ ప్రేమ రహస్యం వెల్లడయి పిచ్చాసుపత్రి పాలవుతాడు. ఆ జుత్తు అతనినించి లాగివేయబడుతుంది. అది ప్రేమా, మజాకా? అపుడూ ఆ ప్రేమ పిచ్చాడు ప్రేమించటం మానడు. వాడినీ, వాడున్న చోటునూ శుభ్రం చెయ్యటానికి ఒక్కొక్క సారికి ఒక బాల్చీ చొప్పున రోజుకు అయిదు బాల్చీల నీరు ఖర్చవుతోందని అసహ్యంచుకుంటాడు వైద్యుడు'.

నెత్తిమీద మొట్టింది. ముక్కాలిపీట మీది నించి కిందికి జారాను. నయం, ఏదీ విరగలేదు. తిరిగి కూర్చుంటూ అన్నాను.

"నీ మొట్టుకు ఉన్నవీ రాలిపోతే రంగేసుకోవటానికి ఏమీ మిగలవు".

"అపుడు వెంట్రుకల తెల్లదనానికి శాశ్వతపు ఫుల్స్టాపు. యూల్ బ్రిన్నర్లా ఇంచక్కా వుంటారు".

నవ్వుతూ చెప్పేనే గాని ఒళ్లు జలదరించే ప్రేమ కథ అది.

మమ్మల్ని వదిలి వెన్నెల నీడై నిష్క్రమించిన యవ్వనంతో, ప్రేమతో - ప్రేమలో పడ్డాం. పునర్ యవ్వనవంతుల మవుతున్నామని అనుకుని, ఒకర్నొకరు చరుచుకుని నవ్వుకున్నాం - ఎవరినో మోసం చేయటంలో సఫలం అయినట్లు. అలసిన ముసలి గుఱ్ఱాలను కొరడాలతో కొట్టి పరుగులు తీయించే మితిమీరిన లైంగిక వ్యాపారానికి మాత్రం పూనుకోలేదు.

గదిలో నించి వెలుపలికి వచ్చాను. భార్య పక్కన ఉండాల్సింది పోయి లోపల ఏం వెలగబెడుతున్నావ్? అన్నట్లున్నాయి కొందరి చూపులు. కొన్ని జాలిగా తగిలాయి. చూపుల పరామర్శ చాలదన్నట్లు ఇద్దరు ముగ్గురు వీపు తట్టేరు. ఇంటి ప్రహరీగోడ అవతల మరి కొందరు దీనంగా నిలబడి వున్నారు. ఆమె పూజకు పూలిచ్చే గన్నేరు చెట్టు తొంగి చూస్తోంది ఇవతలికి, చూసి చూసి పూలు రాల్చేసి.

అగ్ర కులానికి చెందిన నలుగురు దళితులు ఒకరి మీద ఒకరు కేకలేసుకుంటున్నారు. అనైక్యత, పరస్పర ద్వేషం ఒక జాతి లక్షణంలా. ఒకడికి మూగ. మాటకు బదులు ఆకలి లేకుండా పుట్టివుంటే రారాజులా బతికేవాడు. వాడి మాటలురాని నోరు కేకలు మాత్రం దివ్యంగా వేస్తోంది. మరొక వ్యక్తి ఒళ్లంతా డై చేసిన ట్లున్నాడు. ఒకడు వృద్ధుడు - అందర్నీ కాటికి మోసుకుపోతూ, వెళ్లి వుండి పోకుండా, తను మాత్రం ఏం పావుకోటానికో తిరిగి వస్తూ. నాలుగో వ్యక్తి - చావుల గురించేమో - ఉండి వుండి దూరాన్ని చూపులతో వెదుకుతున్నాడు.

నా ప్రేమరాజ్యపు పట్టమహిషి ఊరేగటానికి రథం ఆయత్తం చేస్తున్నప్పటి శ్రద్ధాసక్తులతో పచ్చి వెదురు బొంగులు రెండింటిని, సమాంతరంగా, రెండున్నర అడుగుల ఎడంగా వుంచి, బద్దలు జొనిపి, తాళ్లతో కట్టి సవారి తయారు చేస్తున్నాడు మూగ మనిషి. ఆ సవారి చూస్తుంటే నేనే ఊరేగుదామన్నంత ముచ్చట వేసింది. ఆ కోర్కె కోరితే పిచ్చాసుపత్రికి చేరుస్తారేమో. వాళ్లలో ఎవరో మరొకడిని మందలిస్తున్నాడు - 'తన్నేస్తావురా వెధవా, ఆయన నీ పిండాకూడే గాదు మాదీ పెడతాడు'.

నిప్పుల కుండను, ఖాళీకుండ మరొక దాన్నీ పట్టుకుని, జారిపొయ్యే పంచెలో తల వంచుకుని, సీతమ్మ చావు పల్లకి ముందు, మార్గదర్శిలా, మరుభూమికి మార్గం చూపుతున్నట్లు నడిచాను. అడుగులు పడలేదు - ఒంటరిగా వదిలేసి తను మాత్రం ఇల్లు ఖాళీ చేసి, నన్ను వదిలి వెళుతున్న సీతమ్మకు దారెందుకు చూపాలి?

ఒంటరిగా కాలుతోంది పది పన్నెండేళ్ల - యవ్వనానికి నోచుకోని - కుర్రాడి శవం. వెల్లకిలా కాలుతున్న ఆ చంటాడి తల ఎందుకో, కొంచెంపైకి లేచింది. వచ్చిన సాటి ప్రయాణికుడు/రాలు ఎవరా, సరైన తోడేనా అని చూడటానికేమో.

పిల్లలు వందల యోజనాల దూరంలో వున్నారు. అంత్యక్రియలకు కర్త నేనే. సీతమ్మ నల్లని కురులకు కొరివి పెట్టి, చూడవద్దని పంతులుగారు చెపుతున్నా వినకుండా వెనక్కు తిరిగి తిరిగి చూస్తూ ఇంటివైపు అడుగులు వేశాను. సీత అగ్ని ప్రవేశం చేస్తోంది - ఆ సీతలా, ఫీనిక్స్లా పునర్జీవనం లేనట్టి దహనానికి. వెళ్లిపోయిన ఈ సీత జాడ ఏ జటాయువుకూ తెలీదు. తిరిగి రానీయని ఏ లంక చేరుతుందో, చేరిందో.

ఎవరు మాత్రం ఎంతసేపు తోడుగా దుఃఖించగలరు, చావు వాతావరణంలో గడపగలరు? ఓదార్పు మొక్కుబడి పూర్తి చేసుకుని, నన్ను ఒంటరితనానికి గురిచేసి పోయినారు అంతా.

వెన్నెల కాస్తోంది బయట, యవ్వనపు కవ్వింపులా.

## బజ్జీలకు వేపుడు ముక్కలు

నా పెళ్ళి అయ్యేటప్పటికి, నాకు 16 ఏళ్లు. వంట పెద్దగా రాదు. పెళ్లైన ఆరు నెలలకే కాపురానికి వెళ్లాను. మావారు, మా ఆడపడుచు భర్త కోసం బంగాళాదుంప బజ్జీలు చేయమని చెప్పారు. నాకు బజ్జీలు చేయటం తెలుసు కానీ, ఎప్పుడూ చేయలేదు. బంగాళాదుంపలను వేపుడు ముక్కల్లాగా తరిగి బజ్జీలు వేసి పెట్టాను. దుంప ముక్కలు ఉడకలేదు. కసకసలాడుతున్నాయి. మా ఆడపడుచు భర్త ఏమీ అనలేదు. మా చిన్నాడపడుచు వచ్చింది. ఆవిడకీ బజ్జీలు పెట్టాను. 'ఛా! ఇదేమిటి ఇట్లా ఉన్నాయి?' అంటూ బజ్జీ లోపలి దుంప ముక్కను బయటికి తీసి, 'ఇట్లా తరుగుతారా ఎక్కడైనా? బజ్జీలు వండడం కూడా మీ అమ్మ నేర్పలేదా? ఇక మావాడి పని అయినట్టే' అంది ముక్కు చీదేస్తూ. అంతటితో ఆగక మా పక్కావిడతో, మా తోటి కోడలుతో చెప్పి ఒకటే నవ్వడం.

### మెట్టిన వేళ

ఇంతలో మా మరిది వచ్చాడు. అతను అదంతా విని 'ఎందుకే అంతగా నవ్వుతావు? ముక్క తీసేసి తింటే బజ్జీలు బాగానే ఉన్నాయి. నీకు మీ అత్తగారు దగ్గరుండి వంటలన్నీ నేర్పింది. ఇటు మన అక్కయ్య కూడ నీచేత పని బాగా చేయించింది. వదినకు పాపం అత్తగారు లేరు కదా. ఉన్న ఆడపడుచువేమో వెక్కిరిస్తున్నావు' అని ఆవిడని కసిరి నావైపు తిరిగాడు. 'నువ్వేం బాధపడకులే వదినా. దీని మాటలకేమొచ్చె నేనన్నీ నేర్పుతాలే' అన్నాడు. అతను నాకేం నేర్పకపోయినా అప్పుడు నా పక్షాన మాట్లాడినందుకు నాకెంతో సంతోషమూ, ధైర్యమూ కలిగాయి.

ఇదండీ మెట్టినింట్లో నా తొలినాటి ముచ్చట. ఇదంతా జరిగి 38 ఏళ్లు గడిచాయి. కాని ఆ మధుర స్మృతి నాకు మిగిలిపోయింది. నాటికీ, నేటికీ మా మరిది నన్ను అదే గౌరవాభిమానాలతో ఆదరిస్తున్నాడు.

*టి. ప్రభావతి (గుడివాడ)*

---

ఈ క్షణాన తనదికాని వెన్నెల, నా గురించి గాక కాస్తున్నది. నిజానికి మా గురించి కాయటం ఏనాడో మానేసింది. ఒక భ్రమ ఒప్పుకోనీలేదు ఇంతవరకు.

స్వప్నాల పురుళ్ల గదిలోకి వెళ్లాను. ఒక వెన్నెల పుంజం, పాత అతిథిలా పడక మీద విశ్రాంతి తీసుకుంటోంది. చేసిన ప్రయాణపు దూరం తక్కువది కాదు కదా. దాన్ని చూస్తూ, జంటగా గతాలు తవ్వుకునే వాళ్లం. అనుభవాల నెమరులు వేసి ఆ ఘనకార్యాలు అనితర సాధ్యాలన్నట్లు గర్వపడే వాళ్లం. దహించే అగ్నికి ఇష్టమయిన ఆగ్నేయమూల ముక్కాలిపీట మీద, సిగ్గెరగని సాక్షిలా వీనస్ - అది చూడని గుట్టు లేదు. సీత అటువైపు తల వుంచుకుని ఇపుడు సోకుతున్న వెన్నెల పుంజం ఆమె ముఖం మీద పడుతుండేది సత్యపు వెల్లడికి. ఆమె ఏనాడో వర్జించిన ఎండిన మల్లెమాల విగ్రహం వెనుక దాగివుంది, మనసు ఇరుకు మూలలలో చిక్కుకుపోయిన స్మృతిలా.

ఇద్దరికీ సరిపడా చేయించుకున్న పడక అనంతంగా విస్తరించి వుంది, ఒక్కరోజుకే ఉన్నట్లుండి విశాలమయిపోయి. వెన్నులో ఒంటరితనం కలిగిస్తున్న భయశైతల్యం. కిటికీ అవతల, రేపటి జ్ఞాపకంలా మిగిలిపోయి యవ్వనంలా మిడిసి పడే వెన్నెల. వెన్నెలకేం? తరిగి తరిగి మరో నెలకి తిరిగి విర్రవీగుతుంది - యవ్వనంలా కాక.

"నిరుటి సౌందర్యదరహాసాలు, బాష్పాలు, హిమాలు ఎక్కడున్నాయి?" వాటికి ప్రతీక సీత ఏదీ?

మంచం మీద సీత సాధారణంగా పడుకుంటూ వచ్చిన చోట బోర్లా పడుకున్నా. ఇంకిన సుమాల సౌరభం ముక్కుపుటాలకు లీలగా తగులుతోంది.

జుత్తుకు రంగు వేసుకోవటం ఎలాంటి ప్రాముఖ్యమూ లేని సాధారణ విషయమే. అయినా ఈ క్షణాన అది ఒక అత్యాచార సదృశంగా పశ్చాత్తాపం ఎందుకు కలుగుతోంది? వార్ధక్యపు ప్రథమ పాదంలో వేసుకుంటూ వచ్చినది రంగు గాక ఒక యఫ్రోడిజియాక్‌లా అనుభూతి చెందుతూ దోషభావం, అర్థరాహిత్యం అంతరాంతరాల్లో రగులుతూ రావటం వల్ల కావచ్చు.

అనూహ్యమయిన ఆమె మరణం హృదయంలో చితిని రగిలించింది. జాతస్యహిధ్రువో మృత్యుః-ధర్మజుడు యక్షుడితో అన్నట్లు మనిషి నిత్యం మరణాలను చూస్తున్నా, అతనికి అది సంభవిస్తుందన్న నిజాన్ని మనసు జీర్ణం చేసుకోలేక పోవటం ఒక వింతే. అలాంటి మానవ అశక్తతకు తోడు, మరణ సామీప్యాన్ని హెచ్చరించే వార్ధక్యపు నోరు నొక్కే ప్రయత్నం - ఒక అసహజమైన పని - చేయటం వలన, ఆమె చావు అసాధరణంగా, దారుణంగా, అనూహ్యమైనదిగా తోచి ఉపశాంతిలేని వేదనకు లోనౌతున్నాడేమో. యవ్వనాన్ని ఏనాడో కోల్పోయి, భ్రమకూ అవకాశం పోయి, వంచలో ఉంటూ, వచ్చిన తోడూ పోయి జీవించటం దుర్భరం! అలనాడు 'అబద్ధాన్ని ఆశ్రయించిన సుఖం నిజాన్ని నిరూపించే నరకం కన్నా వేయి రెట్లు నయం' అనుకున్నాం. ఈ సమయాన ఆ అబద్ధంతో పనీలేదు, దాని ఆశ్రయపు సుఖానికి కాలమూ చెల్లింది - ఈ ఒంటరితనపు నిజంలో.

డ్రెస్సింగ్ టేబుల్ దగ్గరికెళ్లి, డై సీసా మూత విప్పి వెన్నెట్లోకి విసిరేశాను. అది పడిన చప్పుడు వినిపించలేదు. కాని వెన్నెలకు మాత్రం మరక అంటివుంటుంది. చేతకానితనంతో, ఉక్రోషంతో ఒక కుర్రవాడు పాల్పడే విధ్వంస చర్యా?

నిజాన్ని ఒప్పుకోవటం వెనుక ధైర్యం ఉంటుంది. అబద్ధం వెనుక పిరికితనం, వంచన ఉంటాయి. ఇది ఒక కన్ఫెషన్: నా ముందు నేను, నా గురించి నేను చేస్తున్నది. ఎవరన్నా చదివి నవ్వుతారేమోనని పిరికితనమూ ఇప్పుడు లేదని ప్రకటించటానికి ముక్కాలిపీట మీద కూర్చుని రాసినది.

## మూడు

ఆమెను సాగనంపి, హైహంస గీతం పాడి ఆగ్నేయం వైపు తల పెట్టుకుని, ముఖం మీద వెన్నెల పుంజం పడుతుండగా ఆఖరి శ్వాస తీసివుంటాడు. ఆమె చావుకని వందల యోజనాల దూరం నుంచి వచ్చిన మేము, ఈయన ఆఖరి ఘడియలకు చేరాము.

యవ్వనం, సౌందర్యం, ప్రేమలతో మోతాదు మించిన ప్రేమలో పడటమూ, ఒంటరితనాన్ని ఎదుర్కోలేక పోవటమూ ఎంత విషాదకరం!

యవ్వనంలోకి అడుగు పెడుతున్న నాకు, అదంటే వణుకు పుడుతోంది. అది లేకుండా ఏకంగా వార్ధక్యంలోకి పోవాలని ఉంది. కిందికెళ్లి విరిగి పోయిన వీనస్‌ను పారెయ్యాలి!

**(మొపాసాకి అంకితం)**